క్లుప్తంగా

అలరించిన గాత్ర కచేరి



కచేరీ నిర్వహిస్తున్న కల్లూరి శ్రీనివాస్

పిఠాపురం: స్థానిక చెలికాని భావనరావు సభా సదన్ విద్యానంద గ్రంథాలయంలో ఆదివారం శ్రీసంఘమేశ్వరా సంగీత సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గాత్ర, మృదంగ కచేరీ శ్రోతలను అమితంగా అలరించింది. విజయవాడకు చెందిన కల్లూరి శ్రీనివాస్ మృదంగం వాయిస్తూ పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన అన్నమయ్య, రామదాసు తదితర వాగ్గేయకారుల కీర్తనలను ఆలపించారు. మృదంగం వాయిస్తూ పాటలు పాడటంలో కల్లూరి శ్రీనివాసరావు దిట్ట అని పలువురు పేర్కొన్నారు. సంగీత అభిమానులు ఆయనను అభినందించారు. వయోలిన్‌ను సరస్వతుల పార్థివ వాయించగా, సరస్వతుల హనుమంతరావు వాయిద్య సహకారాలు అందించారు. గట్టి శ్రీకృష్ణదేవరాయలు, శ్రీకాంత్, పిల్లా సత్యనారాయణ, ఆకొండి వెంకట్రావు, వింజమూరి గాయత్రి, కప్పల భాగ్యం, కొండేపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన సభ్యులను అభినందిస్తున్న నాయకులు

పిఠాపురం: స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఆదివారం పిఠాపురం మండల కమ్యూనిటీ పారా మెడికల్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, జిల్లా కన్వీనర్ బళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా ఎండీ తానీషా, కార్యదర్శిగా కోన విజయ్‌కుమార్, కోశాధికారిగా కంభంపాటి శ్రీరామ్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా నక్కా సూర్యనారాయణ, సహాయ కార్యదర్శిగా పాలిక సత్తిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రతి పీఎంపీ నూతన వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ మెడికోవర్ హాస్పటల్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వచ్చినప్పుడు ప్రథమ చికిత్స ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో కోన చిన్నారావు, జీఎస్ సత్యనారాయణ, మడకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.55 వేల సాయం

పెద్దాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మొబైల్ టెక్నీషియన్ ఎం.విజయ్‌కుమార్‌కు మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ తరఫున ఆదివారం వైద్య ఖర్చుల కోసం రూ.55 వేలు అందజేశారు. డి.సురేష్‌బాబు, సీహెచ్.పాపారావు, బుజ్జి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కర్రల్లాంటి పెండలం



భారీ సైజులో ఉన్న కర్ర పెండలం దుంపలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు పొలంలో వేసిన కర్రపెండలం చెట్టు పేరులో ఉన్నట్టుగానే భారీ కర్రల్లాంటి దుంపలను వేసింది. సాధారణంగా ఒక్కో చెట్టుకు 3 నుంచి 4 కేజీల దుంపలు మాత్రమే ఉంటాయని, ఈ చెట్టు మాత్రం సుమారు 12 కేజీల దుంపలు వేసిందని రైతు తెలిపారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ఆందోళన

తుని: మణిపూర్‌లో ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్ డిమాండ్ చేశారు. స్థానిక వీరవరపుపేటలో ఆదివారం మణిపూర్ ఘటనకు నిరసనగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనకు బాధ్యత వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలన్నారు. దేశంలో ఇంత జరుగుతున్నా నోరు మెదపని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గద్దె దిగాలని డిమాండ్ చేశారు. మోదీ పాలనలో ఆదివాసీలు, దళితులు, ముస్లింలు, మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.అనూహ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు

- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- నెలలో రెండు సార్లు ఇంటి వద్ద వైద్య పరీక్షలు
- ప్రతి క్యాంపులో 100 మందికి పైగా ఓపీ
- హర్షం వ్యక్తం చేస్తున్న దీర్ఘకాలిక రోగులు



జొన్నల గురువు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొత్తపల్లి/సామర్లకోట: గ్రామీణ ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. ఇంటింటికీ నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న సంకల్పంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా సచివాలయం పరిధిలోని ప్రజలకు నెలకు రెండు పర్యాయాలు వారి ఇళ్ల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో వైద్యసేవలు విస్తృతమవ్వడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఎంతో మేలు జరుగుతోంది.

మండలంలో...

కొత్తపల్లి మండలంలో కొత్తపల్లి, కొమరగిరి, నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని గ్రామాల్లో రోగులకు పీహెచ్‌సీ వైద్యులు ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 100 మందికి పైగా ఓపీ వస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

నెలకు సరిపడా మందుల పంపిణీ

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని రోగులకు ఇద్దరు వైద్యులు, ఏఎన్ఎం, డీఈఓ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్త సహకారంతో వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఓపీ సేవలు ఉంటాయి. అనంతరం సాయంత్రం 5 గంటల వరకూ ప్రమాదాలు, వివిధ అనారోగ్య కారణాల వలన మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి చికిత్స చేస్తారు. అంతేకాకుండా 14 రకాల పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణను చేస్తున్నారు. దీంతో పాటుగా ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక సేవలు అందిస్తున్నారు. మారుమూల గ్రామాలు, శివారు ప్రాంతాల ప్రజలకు సైతం ఇంటి వద్దకే వైద్య సేవలు అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పనసపాడులో వైద్యపరీక్షల కోసం వచ్చిన రోగులు



మండలాల వారీగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు

మండలం	విలేజ్ క్లినిక్‌ల సంఖ్య	అంచనా వ్యయం
సామర్లకోట	19	రూ.3.98 కోట్లు
పెద్దాపురం	20	రూ.4.99 కోట్లు
పిఠాపురం	24	రూ.5.81 కోట్లు
కొత్తపల్లి	22	రూ.5.40 కోట్లు
గొల్లప్రోలు	10	రూ.2.80 కోట్లు

విలేజ్ క్లినిక్ లక్ష్యం

ఈ సేవల్లో 12 రకాల వైద్యం, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు విలేజ్ క్లినిక్‌లలో లభ్యమవుతున్నాయి. 24 గంటలు అందుబాటులో సేవలు. ప్రతి రోజు 50 నుంచి 120 వరకు ఓపీ ఉంటుంది. ప్రతి మండలానికి రెండు 104 వాహనాలను ఏర్పాటు చేసి ప్రతీ గ్రామానికి రెండు నుంచి నాలుగు రోజుల పాటు శిబిరాలు నిర్వహించే అవకాశం కల్పించారు.

బీపీ మందులకు ఎంతో ఉపయోగం



నిత్యం సుగర్, బీపీతో బాధ పడుతూ ఉండటంతో గతంలో వేట్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో సుమారు 20 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. అయితే నేడు గ్రామంలోనే 104లో డాక్టరుతో పాటు సిబ్బంది వచ్చి పరీక్షలు నిర్వహించి కావలసిన మందులు అందజేస్తున్నారు.

– సత్తి పద్మావతి, గృహిణి, పనసపాడు.

అందుబాటులోనే వైద్యం



విలేజ్ క్లినిక్‌లు రావడంతో గ్రామాల్లోనే వైద్య సేవలందిస్తున్నారు. ఇంటింటికీ వైద్య సిబ్బంది వస్తున్నారు. పాము కాటు, కుక్కకాటు మందులు కూడా విలేజ్ క్లినిక్‌లో అందుబాటులో ఉన్నాయి.

– కత్తుల విజయకుమారి, కట్టమూరు, పెద్దాపురం మండలం.

ఇంటి వద్దే నాణ్యమైన వైద్య సేవలు



నేను చాలా కాలంగా బీపీ, మధుమేహం వ్యాధితో బాధ పడుతున్నాను. గతంలో ఆసుపత్రుల చుట్టూ తిరిగేవాడిని. ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇంటి వద్దే వైద్య సేవలు పొందుతున్నాను. వైద్యులు ఎంతో ఓపికగా పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు.

– శీకోటి రాజు, జొన్నల గరువు, ఎండపల్లి

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



గత కొంత కాలంగా బీపీతో బాధపడుతున్నాను. ప్రస్తుతం సీఎం జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల వైద్యులు 104 వాహనంలో ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు చేస్తున్నారు. నెలకు సరిపడా మందులు ఉచితంగా ఇస్తున్నారు. పేదలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– ఎ.అప్పయ్యమ్మ, జొన్నలగరువు, ఎండపల్లి

వైద్య సేవలపై ప్రజలకు అవగాహన



ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. సొంత గ్రామంలోనే వైద్య పరీక్షలు చేయడంతో రోగులు భారీగా వస్తున్నారు. అన్ని పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరంగా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం.

–మౌనిక, పీహెచ్‌సీ వైద్యాధికారి, కొత్తపల్లి

గ్రామాభివృద్ధికి అందరి సహకారం అవసరం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



రమణక్కపేటలో గ్రావెల్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: గ్రామాభివృద్ధికి అందరి సహాయ సహకారాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని రమణక్కపేటలో శ్రీరామ కమిటీ ఆధ్వర్యంలో రైతులు నిర్మించుకున్న గ్రావెల్ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. స్థానిక విజయ జనార్దనస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ కాజులూరి అమ్మజీ ఆధ్వర్యంలో దేవదాయశాఖ అధికారులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేశామన్నారు. నవరత్న పథకాల అమలుతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొత్త చరిత్రను లిఖించారన్నారు. పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అమ్మ ఒడి, ఉన్నత చదువులు చదివేందుకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, మాజీ సర్పంచి వడి నాగమణి, సప్తగిరి హేచరీస్ ఎండీ సత్తి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తిని పెంపొందించుకోవాలి

ప్రతిఒక్కరూ దైవ భక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గోమాతకు పూజలు చేసి యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో అబ్బిరెడ్డి నారాయణ రెడ్డి, పెనుమల్లు భాస్కర్‌రెడ్డి, అబ్బిరెడ్డి పద్మారెడ్డి, అబ్బిరెడ్డి గోవింద్, కాజులూరి శ్రీరామ్, కాజులూరి నేరెళ్లరెడ్డి, ఆలమూరు వీరభద్రరావు, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లై డిటెక్టర్ టెస్టుకు రాజప్ప సిద్ధమా?

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నీతివంతుడుగా రుజువు చేసుకోవడానికి లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధమా అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సవాల్ విసిరారు. నియోజకవర్గ పరిధిలోని నాయకులతో కలిసి సామర్లకోట క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మట్టి అమ్మకం ద్వారా రూ.కోట్లు సంపాదించవచ్చునని కనిపెట్టిన గొప్ప శాస్త్రవేత్త రాజప్ప అని అన్నారు. గ్రావెల్ మాఫియాకు, అవినీతి పరులకు రాజప్ప ఆదర్శంగా ఉన్నారని ఆరోపించారు. ఉపముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో రాజప్ప భారీ ఎత్తున అవినీతికి పాల్పడి, తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 216 జాతీయ రహదారి నిర్మాణం సమయంలో గొంచాల–అచ్చంపేట మధ్యలో అండర్ పాస్ ఏర్పాటు చేయాలని ఎనిమిది గ్రామాల నాయకులు, ప్రజలు మొర పెట్టుకొంటే మౌనం వహించడం అవినీతిలో భాగం కాదా అని ప్రశ్నించారు. పెద్దాపురం బస్సు కాంప్లెక్స్ నుంచి బస్సు షెల్టర్ల వరకు రాజప్ప పాలనలో అవినీతి మయంగా మారిందన్నారు. సామర్లకోట–పెద్దాపురం రోడ్డు విస్తరణ పనుల్లో పక్షపాత వైఖరి అవలంబించలేదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని రాజప్ప ఆరోపణలు చేస్తున్నారని, తనపై అవినీతిని నిరూపించాలని అన్నారు. తొలి తిరుపతి దేవస్థానాన్ని తమ పాలనలోనే అభివృద్ధి చేశామని తెలిపారు. తమ పాలనలో రోడ్లు వేశామన్నారు. గ్రామీణ ప్రాంతంలో 92 శాతం, అర్బన్‌లో 87 శాతం మందికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఇంకా లబ్ధిదారులను గుర్తించడానికి జగనన్న సురక్ష అమలు చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీమంగతయారు, ఎంపీపీలు పి.సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైస్ చైర్మన్లు ఊజా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

సర్వే చేస్తూ... అర్హులను గుర్తిస్తూ...



లబ్ధిదారుడు చింతా సత్యనారాయణకు పింఛనుకు సర్వే చేస్తున్న వలంటీరు కోడి దేవి

సామర్లకోట: స్థానిక 15వ సచివాలయం పరిధిలోని వలంటీరు కోడి దేవి అమ్మాణమ్మ అపార్టుమెంటులో తనకు కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహిస్తోంది. నవరత్న పథకాల్లో వారికి అర్హత ఉంటే ఆయా పథకాలను వారికి వివరిస్తోంది. దీనిలో భాగంగా అమ్మాణమ్మ అపార్టుమెంటులో నివాసం ఉంటున్న చింతా సత్యనారాయణ వయస్సు 60 సంవత్సరాలు దాటి పోవడం, పేదరికంలో ఉండటంతో వృద్ధాప్య పింఛనుకు దరఖాస్తు చేయించింది. ప్రతీ నెల ఒకటో తేదీన వేకువ జామునే లబ్ధిదారులకు పింఛను అందజేస్తోంది.

– లబ్ధిదారుల సర్వేలో వలంటీరు కోడి దేవి, సామర్లకోట

ఇంటి వద్దే పింఛను అందుతోంది



ప్రతీ నెల ఒకటో తేది సెలవు అయినా ఉదయమే ఇంటికి వచ్చి వలంటీరు దేవి పింఛను అందజేస్తోంది. గతంలో పింఛను కోసం దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. వలంటీరు ఇంటింట సర్వే చేసిన సమయంలో నా అర్హత గుర్తించి పింఛను వస్తుందని భరోసా ఇవ్వడమే కాకుండా వచ్చేలా చేసింది. నా భార్య చింతా పార్వతికి చేయూత పథకం వస్తోంది. దాంతో ఆనందంతో చింత లేకుండా జీవిస్తున్నాం.

– చింతా సత్యనారాయణ, సామర్లకోట

ప్రజలకు మెరుగైన సేవలు



వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. పిల్లలను బడికి పంపితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.15 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని మా వలంటీర్ ఎస్. వీరవెంకటసత్యనారాయణ చెబితే నేను నమ్మలేదు. వలంటీర్ దరఖాస్తు తీసుకొచ్చి సంతకం చేయించుకుని వెళ్లాడు. కొన్ని రోజుల తరువాత వచ్చి మీకు అమ్మ ఒడి మంజూరైందని చెప్పాడు. గత నాలుగేళ్లుగా అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాను. వలంటీర్లు ప్రజలు, ప్రభుత్వానికి వారధులుగా పని చేస్తున్నారు.

– సన్నిబోయిన సత్యవతి, కొమరగిరి

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- పార్టీ రహితంగా సేవలు
- పెద్దాపురం మండల సమావేశం



సమావేశంలో ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ రాజా

పెద్దాపురం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రతీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు పని చేయాలని పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు అన్నారు. పెద్దాపురం మండల పరిషత్ సమావేశం ఆదివారం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు మెచ్చే నాయకుడిలా పని చేయాలన్నారు. ప్రజలకు నేరుగా సచివాలయాల ద్వారా పార్టీ రహితంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఎంపీపీ పెంకే సత్యవతి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జీరో అవర్‌లో తిరుపతి ఎంపీటీసీ సభ్యుడు కుంచే బుచ్చిరాజు మాట్లాడుతూ ఏలేరు ప్రాంత రైతులకు సాగునీరు సకాలంలో విడుదల చేయాలన్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వైస్ ఎంపీపీ మిరియాల రాజా మాట్లాడుతూ మర్లావ, కాండ్రకోట, తామరాడ ఆర్టీసీ బస్సు సర్వీసును సత్వరమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. అనంతరం సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ ప్రగతిని వివరించగా సభ్యులు తమ ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, హౌసింగ్ చైర్మన్ పీఎస్ రాజశేఖర్, మండల విస్తరణాధికారి మూర్తి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, వ్యవసాయ శాఖ ఏఓ సంజయ్‌కుమార్, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, కో–ఆప్షన్ సభ్యులు బిక్కిన శేష వీరకుమారి పాల్గొన్నారు.

సాగర తీరం.. జనహోరం

- ఉప్పాడ తీరంలో పర్యాటకుల సందడి
- బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం



పర్యాటకులతో కిటకిటలాడిన ఉప్పాడ సాగరతీరం



కడలి కెరటాల్లో కేరింతలు కొడుతున్న యువత

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. సెలవు రోజు కావడంతో కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. యువత కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. పర్యాటకుల ఆట పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఉదయం తుని సమీపంలోని తలుపులమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు.

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తుల పూజలందుకున్న మరిడమ్మ

పెద్దాపురం: జాతర ఉత్సవాల్లో భాగంగా మరిడమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ క్యూ కట్టారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టారు. సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు లక్ష వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అంచనా. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా పులిహోర, పాలు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.